


సాక్షి
విశాఖపట్నం

రేపటికి ముందడుగు

శుక్రవారం । 8 । మార్చి । 2024



న్యూస్‌రీల్

భరోసా కోసం ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు

విశాఖ సిటీ: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా భరోసా కల్పించేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు గురువారం నగర పరిధిలో అనేక ప్రాంతాల్లో కేంద్ర పోలీస్ బలగాలు, సివిల్ పోలీసులు కలిసి మార్చ్ చేపట్టారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో పూర్తి భద్రతా చర్యల మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

తీరప్రాంతాల్లో భారీ బందోబస్తు



అధికారులకు సూచనలిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: మహా శివరాత్రి సందర్భంగా తీర ప్రాంతాలకు పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండతో పాటు భక్తులు పుణ్యస్నానాల కోసం వచ్చే సముద్ర తీర ప్రాంతాలు, ప్రముఖ దేవాలయాల వద్ద భద్రతా చర్యలను సీపీ గురువారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాల వద్ద, ముఖ్యంగా జన సందోహం అధికంగా ఉండే ఆర్కే బీచ్, అప్పికొండ బీచ్ ప్రాంతాల్లో మరింత జాగ్రత్తలతో వ్యవహరించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం బీచ్ పెట్రోలింగ్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ చేయాలని చెప్పారు. సౌండ్ సిస్టంతో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టుల ద్వారా సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో నాల్గవ యూనిట్‌లో గురువారం సాయంత్రం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 5.30 సమయంలో సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గవ యూనిట్ బ్రాయిలర్‌లో ఏర్పాటు చేసిన ట్యూబుకు రంధ్రం ఏర్పడి విద్యుదుత్పత్తికి విఘాతం ఏర్పడింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి మరమ్మతులకు సన్నాహాలు ప్రారంభించారు. శనివారం నాటికల్లా యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం 1, 2, 3 యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి యథావిధిగా జరుగుతుందని ఎన్టీపీసీ అధికారులు వెల్లడించారు.

'అంతర్జాతీయ వ్యవహారాల' డీన్‌గా ధనుంజయరావు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు నియమితులయ్యారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి గురువారం ఆయన ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య ధనుంజయరావు 2012 నుంచి 2014 వరకు డీన్‌గా, 2014-16లో ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా, ఇన్‌చార్జి వీసీ(ఎఫ్ఏసీ)గా, 2017-2023 వరకు డీన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఏయూ జియాలజీ విభాగంలో బీవోఎస్ చైర్మన్‌గా కూడా సమర్థవంతమైన సేవలందించారు. ఏయూలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య వెయ్యి మార్క్‌ని చేరుకోవడంలో ఆయన విశేష కృషి చేశారు. విదేశాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి.. ఏయూకు విదేశీ విద్యార్థులను తీసుకురావడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ సందర్భంగా ఆయన్ని వర్సిటీ ఆచార్యులు, విదేశీ విద్యార్థులు అభినందించారు.

అనకాపల్లి మండలం పిసినికాడ సభలో పాల్గొన్న జన సందోహం



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

జన హర్షం పూల వర్షం

ప్రభం'జనం'.. వెల్లువెత్తిన అభిమానం.. ఉప్పొంగిన ఉత్సాహం.. సంక్షేమ సారథిపై అడుగడుగునా పూల వర్షం.. పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న జననేతకు జన నీరాజనం.. నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత మొదటిసారి అనకాపల్లి నియోజకవర్గానికి విచ్చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రియతమ సీఎం ప్రసంగానికి కరతాళధ్వనులతో హర్షం వెలిబుచ్చారు. ముఖ్యమంత్రిని చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మల సందడి అనకాపల్లి మండలం పిసినికాడలో గురువారం జాతరను తలపించింది. మహాశివరాత్రి పర్వదినం ముందే వచ్చిందా అన్నట్లు జాతీయ రహదారి అంతా పండగ వాతావరణం కనిపించింది. ఓ పెద్ద కొడుకు.. ఓ పెద్దన్న వచ్చినంత ఆనందంగా ఉందని మహిళలు ఉప్పొంగిపోయారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు అభిమాన నేతకు బ్రహ్మరథం పట్టారు. ఈ ఐదేళ్లలో పొందిన లబ్ధికి కృతజ్ఞతగా 'థాంక్యూ సీఎం సర్' అంటూ ప్లకార్డులు పట్టుకుని హర్షం వ్యక్తం చేశారు.

- అట్టహాసంగా చేయూత నాలుగో విడత నిధుల పంపిణీ
- ప్రియతమ సీఎంను చూసేందుకు బారులు తీరిన ప్రజలు
- జై జగన్.. వన్స్‌మోర్ సీఎం.. నినాదాలతో హోరెత్తిన అనకాపల్లి

సాక్షి, అనకాపల్లి: అభిమానం.. ఆత్మీయత అంటే ఇలా ఉంటుందన్న రీతిలో సాగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం.. అందుకు ప్రతిస్పందనగా ప్రజల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకంతో అనకాపల్లి మండలం పిసినికాడ ఓ అపూర్వమైన సందర్భానికి వేదికగా నిలిచింది. సీఎం మాట్లాడుతున్నంతసేపూ జనం కరతాళధ్వనులతో ఆప్యాయత వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు సీఎం జగన్ వివరించారు. 99 శాతం హామీలు అమలు చేయడమే కాకుండా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేవిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వాటితో లబ్ధి పొందిన పేద ప్రజల గురించి తెలిపారు. గత టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఎలా మోసం చేశారో విపులీకరించారు. దీంతో వన్స్‌మోర్ సీఎం.. జై జగన్.. అని నినాదాలు చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికారు. మహిళాభ్యున్నతికి చేపడుతున్న పథకాలను సీఎం వివరిస్తుండగా అక్క చెల్లెమ్మలు థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి అభిమానాన్ని చాటుకున్నారు. సభా ప్రాంగణం మొత్తం జనంతో నిండిపోగా.. సభావేదిక వెలుపల వేలాది మంది నిల్చొని అభిమాన నేత ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించడం కనిపించింది.

సభ జరిగిందిలా..

విశాఖ నుంచి హెలికాప్టర్‌లో కశింకోట వచ్చిన సీఎం వైఎస్ జగన్.. రోడ్డు మార్గంలో అనకాపల్లి మండలం పిసినికాడ సభావేదిక వద్దకు ఉదయం 11.10 గంటలకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ ప్రసంగించారు. అనంతరం జిల్లాలో లబ్ధి పొందిన ఇద్దరు మహిళలు తమకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటితో ఏ విధంగా లాభం పొందారో వివరించారు. కోటవురట్ల మండలం రామచంద్రపాలేనికి చెందిన రమణమ్మ, చీడికాడ మండలం గండివరం గ్రామానికి చెందిన సుంకర వెంకటలక్ష్మి సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొందిన లబ్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి లబ్ధిదారులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగించారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు సత్యవతి, మాధవి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, యూవీ రమణమూర్తిరాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఏపీడబ్ల్యూఐడీసీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మహిళా కమిషన్ సభ్యులు గెడ్డం ఉమా తదితరులు పాల్గొన్నారు.



జననేతపై పూలవర్షం కురిపిస్తున్న యువతులు



బటన్ నొక్కి చేయూత నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అనకాపల్లికి సీఎం వరాల జల్లు



సీఎం జగన్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అనకాపల్లి నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు వరాలు కురిపించారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమంలో సభా వేదిక సాక్షిగా రూ.21 కోట్లతో తలపెట్టే పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత వీటిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా పైవిధంగా స్పందించారు. వాటిలో రూ.5 కోట్లతో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌లో నూతన కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు, రూ.3 కోట్లతో కశింకోటలో శారదానదిపై అసంపూర్తిగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణం, రూ.3 కోట్లతో రేబాక నుంచి కొప్పాక వరకూ డబుల్ రోడ్డు నిర్మాణం, రూ.4 కోట్లతో గవరపాలెం నుంచి తుమ్మపాల, తుమ్మపాల నుంచి బొజ్జనకొండ వరకూ వెళ్లే రోడ్డు నిర్మాణం, శారదా నది ఒడ్డున ఈ కాలనీ చుట్టూ రూ.6 కోట్లతో రిటర్నింగ్ వాల్ నిర్మాణం ఉన్నాయి.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

గోపాలపట్నం: అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన గురువారం ఉదయం 9.32 గంటలకు గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలు దేరి.. 10.07 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎస్.చంద్రమౌళి, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీసీపీ మేకా సత్తిబాబు, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి 10.18 గంటలకు ఆయన హెలికాప్టర్‌లో అనకాపల్లి బయలుదేరారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నారు. అక్కడ పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు సీఎం జగన్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో 2.50 గంటలకు గన్నవరం బయలుదేరారు.

సింహాచల క్షేత్ర వైభవం..విశ్వవ్యాప్తం

- ప్రసాద్ స్కీమ్‌తో మారనున్న రూపురేఖలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ. 54.04 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన



మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: దేశవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి ప్రధాని మోదీ తీసుకున్న చర్యలు అభినందనీయమని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సింహాచల క్షేత్రంలో ప్రసాద్ స్కీమ్ నిధులు 54.04 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా రూ.30కోట్లతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని బొర్రా గుహల వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ప్రధాని మోదీ జమ్మూ కశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్తంశెట్టి మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి ప్రసాద్ పథకం నిధులు రావడానికి తాను, ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన కృషి ఎంతో ఉందన్నారు. సింహాచల క్షేత్ర వైభవం విశ్వవ్యాప్తం కావాలని.. అందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి.. వీలైనంత త్వరగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సింహాచలం క్షేత్రంలో నిత్యం నారసింహ యజ్ఞం చేయాలని దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తికి సూచించారు. దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూసమస్య పరిష్కారమైతే.. రాష్ట్రంలో అత్యంత ధనికుడిగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అవుతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ దేశంలో ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టూరిజం చీఫ్ ఇంజినీర్ సి.ఎస్.ఎన్ మూర్తి మాట్లాడుతూ పర్యాటకానికి సంబంధించి 52 ప్రాజెక్ట్‌లను శ్రీనగర్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా బొర్రా గుహలు ప్రాంతానికి చెందిన గిరిజన మహిళలు చేసిన థింసా నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఏపీ టూరిజం చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, జస్టిస్ రాధా కత్యల్, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అల్లూరి జేసీ భావన వశిష్ట, టూరిజం ప్రాంతీయ సంచాలకుడు రమణ, ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌మోహన్, సైల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఇలా..

- ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా సింహాచల క్షేత్రంలో కొండదిగువన యాత్రికులకు వసతి సౌకర్యం, నూతన ఘాట్‌రోడ్డు వద్ద నాలుగు బస్ షెల్టర్లు, ఫుడ్ కోర్టులు, టూ, ఫోర్ వీలర్ పార్కింగ్, హరిత వనాలు, వ్యూ పాయింట్లు, 1,200 మెట్ల అభివృద్ధి, షెల్టర్, మంచి నీటి సౌకర్యం, ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నారు. కొండపైన భారీ క్యూ కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, యాత్రికుల సమాచార కేంద్రం, ఫుడ్ కోర్టులు, 500 మంది వరకు కూర్చునేందుకు వీలుగా యాంఫి థియేటర్, సోలార్ పవర్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజీ గదులు, ఆధునిక వసతులతో వంటశాల, ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.
- స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా బొర్రా గుహల ప్రధాన ప్రవేశం, పార్కింగ్, టాయిలెట్ బ్లాక్‌లు, వీధుల అభివృద్ధి, గుహల బయట యాత్రికులు వేచి ఉండే గదులు, గుహ మార్గం అభివృద్ధి, ఫుడ్ ప్లాజాలు, గుహల లోపల పూర్తి స్థాయిలో మార్పులు, లైటింగ్ పనులు వంటివి చేపడతారు.

చేసిన మంచినే చెప్పండి

పార్టీ నేతలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల నేతలతో ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఎండాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఎన్నికల సన్నద్ధతపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రజలందరిని కలిసి ప్రభుత్వం చేపట్టిన మంచిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాల నాయుడు, రాజన్న దొర, డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎం.వి.వి సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజ్, కన్నబాబురాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, శంబంగి చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పల నరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, సమన్వయకర్తలు కేకే రాజు, ఆడారి ఆనంద్ కుమార్, రామచంద్రరావు, మలసాల భరత్, విశ్వేశ్వరరాజు, మత్స్య లింగం, తలారి రాజయ్య, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అప్పికొండ తీరాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి లక్షల్లో భక్తులు వస్తారని.. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం, బీచ్ పరిసర ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు, క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ ఆవరణలో తివాచీలు, టెంట్లు వేయాలన్నారు. భక్తుల కోసం 16 చోట్ల తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. లైటింగ్, మరుగుదొడ్లు, నిరంతర పారిశుధ్య ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయానికి తరలివచ్చే భక్తుల కోసం సూచిక బోర్డులు పెట్టాలన్నారు. అప్పికొండ తీరంలో స్నానమాచరించే భక్తులకు ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే బీచ్‌లో బోట్లు, గజ ఈతగాళ్లను మత్స్య శాఖాధికారులు ఏర్పాటు చేశారని, వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు, అధికారులు సురేష్ కుమార్, డాక్టర్ నరేష్‌కుమార్, గోవిందరావు, కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మి, ప్రసాదరావు, రేవతి పాల్గొన్నారు.

రూ.158.77 కోట్ల ఆర్థిక 'చేయూత'



మహిళలకు చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

జిల్లాలో 84,678 మంది మహిళలకు లబ్ధి


మహారాణిపేట: వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడతలో జిల్లాకు చెందిన 84,678 మంది ఆర్థిక ప్రయోజనం పొందారు. వారిలో గ్రామీణ విశాఖకు చెందిన 14,836 మంది, జీవీఎంసీ పరిధిలో 69,842 మంది ఉన్నారు. ఒక్కొక్కరి ఖాతాలో రూ.18,750 చొప్పున మొత్తం రూ.158,77,12,500 నిధులు జమయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చేయూత నిధులను విడుదల చేశారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ ఎస్.శోభారాణి, మైనారిటీ సంక్షేమ శాఖ ఈడీ సయ్యద్ సిరాజుల్లా, పలువురు మహిళలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు లబ్ధిదారులకు జేసీ చేతులమీదుగా రూ.158.77 కోట్ల నమూనా చెక్కును అందజేశారు.

అమ్మలా ఆదరణ

తల్లిదండ్రులకు దూరమైన బాలికలు కొందరు. ఏ దిక్కూ లేని ఆడపిల్లలు మరికొందరు. మానవ మృగాల చేతిలో అఘాయిత్యానికి గురై అభాగ్యులైన అమ్మాయిలు ఇంకొందరు. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఇంటికి దూరమైన ఇలాంటి ఎంతోమంది ఆడపిల్లలను విశాఖలోని 'ప్రభుత్వ బాలికల సదనం' అమ్మలా ఆదరిస్తోంది.

- ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖలో ప్రత్యేక బాలికల సదనం
- చేదు జ్ఞాపకాలను మరిపించేలా వినూత్న కార్యక్రమాలు
- బాలికలకు ఆసక్తి గల రంగాల్లో నైపుణ్య శిక్షణ
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా తోడ్పాటు


విశాఖలోని ప్రత్యేక బాలికల సదనం



విశాఖ విద్య: అత్యాచార బాధితులు, అనాథలు, నేరారోపణకు గురైన 7 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికలకు అండగా నిలిచేలా ప్రభుత్వం విశాఖ, తిరుపతిలో 'ప్రభుత్వ బాలికల సదనం- పరిశీలన గృహాలను' నిర్వహిస్తోంది. విశాఖలో 2007లో దీనిని ప్రారంభించారు. శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు రాష్ట్రంలోని 15 జిల్లాలకు చెందిన బాలికలకు ఇక్కడ వసతి కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 77 మంది బాలికలు ఆశ్రయం పొందుతున్నారు.

భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేలా..

అర్ధాంతరంగా చదువు మధ్యలోనే ఆపేసిన వారి ఆసక్తి మేరకు సార్వత్రిక విద్యా విధానంలో కొనసాగించేలా అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న బాలికల్లో ముగ్గురు టెన్త్, ఆరుగురు ఇంటర్మీడియెట్ పరీక్షలకు సిద్ధమౌతున్నారు. ఏటా ఇదే మాదిరి బాలికలు చదువులు కొనసాగిస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. సదనం నుంచి బయటకు వెళ్లినా, స్వశక్తితో నిలదొక్కుకునేలా ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఫుడ్ క్రాఫ్ట్‌లో ఏడాదన్నర శిక్షణ పొందిన ఇద్దరు బాలికలు నగరంలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఓ బాలిక ఫిజియోథెరపిస్టు కోర్సు పూర్తి చేసి కొలువు దక్కించుకుంది. మరో నలుగురు నర్సింగ్ శిక్షణ పొందిన ఆస్పత్రిలోనే కొలువులు సిద్ధంగా ఉన్నాయి. తమ చేదు జ్ఞాపకాలను సదనంలోనే వదిలి, బంగారు భవిష్యత్ వైపు అడుగులు వేస్తున్నారు.

ఆసరా కల్పించటమే లక్ష్యం

అనివార్య కారణాలతో అందరికీ దూరమై సదనంకు చేరిన బాలికలకు ఆసరా కల్పించేందుకు కేంద్రం నిర్వాహకులు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధీకులు గురించి ఆరా తీసి, బాలికలను వారి చెంతకు చేర్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బంధువులెవ్వరూ లేని బాలికలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దత్తత ఇవ్వటం, గుర్తింపు ఉన్న స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి వారికి భరోసాగా నిలుస్తున్నారు.

సొంత పిల్లల్లా చూసుకుంటున్నాం



సదనంలో బాలికలను తమ సొంత పిల్లల్లా చూసుకుంటున్నాం. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు బాలికలకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాస్టారు సహకారంతో బాలికలకు వివిధ రకాల శిక్షణలు ఇప్పిస్తున్నాం.

– ఏవీ.సునీత, సూపరింటెండెంట్, బాలికల సదనం

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో బాలికలు సదనంకు వస్తారు. అందువల్ల వివిధ రకాల ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటారు. అలాంటి వారిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇచ్చి, తగిన వైద్య సేవలు అందిస్తాం. బాలికల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. అత్యవసరమైన పరిస్థితుల్లో తామే స్వయంగా కేజీహెచ్‌కు తీసుకెళ్లి, తగిన వైద్యం చేయిస్తాం.

– డాక్టర్ శోభారాణి, కేంద్రం వైద్యురాలు

బాలికలకు అండగా నిలుస్తాం



బాలికల భద్రతతోపాటు, వారికి అండగా నిలిచేలా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిరంతరం పర్యవేక్షణ చేస్తాం. ప్రతీ 15 రోజులకోసారి సమావేశమై సదనం నిర్వహణపై సమీక్షిస్తాం. బాలికలను వారి బంధువుల వద్దకు చేర్చేలా తగిన ఆదేశాలు ఇస్తాం. గుర్తింపు ఉన్న సీసీఏలకు బాలికలను తరలించి, వారికి అన్ని రకాలకు తోడ్పాటు అందిస్తాం.

– ఎం.ఆర్.ఎల్. రాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్

మహిళా నీకు వందనం



ఏయూక్యాంపస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ విభిన్నమైన చిత్రంతో ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఒక చేత్తో చిన్నారిని, మరో చేత్తో ల్యాప్‌టాప్‌ను పట్టుకుని కుటుంబ బాధ్యతలు, వృత్తిపరమైన బాధ్యతలను సమన్వయం చేసుకుంటున్న ఓ మహిళను చిత్రీకరించారు. కేవలం మిల్లెట్స్‌ని మాత్రమే వినియోగించి రూపొందించిన ఈ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది.


విజయ్ కుమార్

కోరం లేక జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు వాయిదా

మహారాణిపేట: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు గురువారం కోరం లేక వాయిదా పడ్డాయి. ఒకటి నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలకు జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం పిసినికాడలో జరిగిన వైఎస్సార్ చేయూత అధికారిక కార్యక్రమం కావడంతో సభ్యులు, అధికారులు అక్కడికి వెళ్లారు. దీంతో స్థాయీ సంఘాల సమావేశాలను వాయిదా వేసినట్లు డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. మళ్లీ ఎప్పుడు సమావేశాలు నిర్వహించే విషయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆనందహేల

- వైద్య ఆరోగ్య శాఖలో 93 మందికి పర్మినెంట్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో మరికొందరికి అవకాశం

మహారాణిపేట/సీతంపేట: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 21 ఏళ్లుగా పని చేస్తున్న వీరి జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. ఇచ్చిన మాటను మరోసారి నిలబెట్టుకుని క్రమబద్ధీకరణ చేయడం పట్ల కాంట్రాక్ట్ ఉద్యోగుల సంతోషానికి అవధుల్లేవు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సానుకూల దృక్పథంతోనే ముందుకు సాగింది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ ఇటీవలే మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రెండు నెలల పాటు అన్ని రకాల ఫైళ్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బంది తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మొత్తం 327 మందితో జాబితాను సిద్ధం చేశారు. ఇందులో ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు గ్రేడ్–2 స్టాఫ్ నర్సులు, ఎంపీహెచ్‌ఏ(మేల్), ఇతర ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ముందుగా 93 మంది ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 81 మంది ఎంపీహెచ్‌ఏ(ఎం)లు, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరుగురు ఫార్మసిస్టులు ఉన్నారు. త్వరలో మరికొందరికి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని ప్రస్తుతం పక్కన పెట్టారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగులు నింపారు



మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను అని ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ ఈ రోజు కార్యరూపం దాల్చింది. 21 ఏళ్లుగా పనిచేస్తున్న మా జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే రావాలి. మాలాంటి వారికి మరింత మేలు జరగాలి.

– వై.సింహాచలం, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధి

ఉద్యోగ భద్రత కల్పించారు



కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వాలు హామీలిచ్చినా.. కోర్టు కేసుల నెపంతో ఏళ్ల తరబడి మోసం చేశాయి. అంతేకాకుండా అప్పటి వరకు కాంట్రాక్ట్ ఉద్యోగులకున్న 100 శాతం గ్రాస్ శాలరీ బెనిఫిట్ కూడా తొలగించాయి. చాలా ఏళ్లుగా మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నేను చెప్పానంటే చేస్తానంతే అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మా ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.గణేష్, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్

చారిత్రాత్మక ఘట్టం



కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఓ చారిత్రాత్మక ఘట్టం. ఎన్నో కోర్టు కేసులు, అడ్డంకులు ఉన్న వాటన్నింటిని న్యాయపరంగా తొలగించి.. ఈరోజు వేలాది మందిని రెగ్యులర్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి రాష్ట్రంలో సుమారు 2,146 మందిని రెగ్యులర్ చేస్తూ జీవో విడుదలైంది. దీని వల్ల విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ కేడర్లలో పని చేస్తున్న సుమారు 230 మందికి లబ్ధి చేకూరింది. ఇంకా మరికొంత మందికి రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది.

– వై.వి.రమణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి

వెలమలను గుర్తించిన పార్టీకే మద్దతు

వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక

డాబాగార్డెన్స్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వెలమలకు 24 అసెంబ్లీ, 5 పార్లమెంట్ సీట్లు కేటాయించాలని వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వెలమ సామాజిక వర్గం జనాభా 35 లక్షలని తెలిపారు. జనాభా ప్రాతిపదికన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు పార్లమెంట్ స్థానాలతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉత్తర, దక్షిణ, గాజువాక, భీమునిపట్నం, పెందుర్తి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, విజయనగరం జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాలను వెలమ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. విజయనగరం జిల్లాను విభజించిన తర్వాత ఏర్పడిన పార్వతీపురం జిల్లాలో 60 శాతం వెలమ జనాభా ఉందన్నారు. వెలమ సామాజిక వర్గాన్ని విస్మరిస్తే అన్ని రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వెలమలను గుర్తించిన పార్టీకే మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో సిరిపురపు కృష్ణమోహన్, డాక్టర్ బోకం దేముడు, జాగరపు రామునాయుడు, వెన్నెల సూర్యనారాయణ, సిరికి పోతురాజు, జాగరపు బుచ్చరాజు, పాటిపిరెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో ప్రముఖ స్థానం కల్పించాలి

బీచ్‌రోడ్డు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి ప్రముఖ స్థానం కల్పించాలని వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు డిమాండ్ చేశారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో పరిరక్షణ వేదిక చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల్లో తమ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఉన్నారన్నారు. సీట్లు కేటాయింపు విషయమై అన్ని పార్టీలకు ఇప్పటికే వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. అత్యధికంగా వెలమ జనాభా ఉన్న 24 నియోజకవర్గాల్లో తమ సామాజిక వర్గానికే సీట్లు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా తగిన ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్కా చినబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, రొంగలి జగన్నాథం, ముర్రి ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: పరీక్షలు బాగా రాయడం లేదనే బాధతో మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 86వ వార్డు పరిధి ఫకీర్‌తకియాలోని అంబేడ్కర్‌నగర్‌లో విద్యార్థి(16) కుటుంబంతో నివసిస్తున్నాడు. గాజువాకలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే పరీక్షలు బాగా రాయడం లేదని, తాను ఫెయిల్ అయిపోతానని తల్లిదండ్రులకు చెప్పి బాధపడేవాడు. పరీక్షల్లో ఫెయిల్ అయినా బాధపడొద్దని, మళ్లీ పరీక్షలు రాయవచ్చని వారు కుమారుడికి ధైర్యం చెబుతూనే ఉన్నారు. ఈ క్రమంలో గురువారం తండ్రి విధులకు, తల్లి బ్యాంకు పని నిమిత్తం గాజువాక వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యార్థి రేకుల షెడ్డులోని పైపునకు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం తల్లి ఇంటికి వచ్చి చూసే సరికి పైపునకు వేళాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె స్థానికుల సాయంతో కుమారుడిని కిందకు దించి.. అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంటా.. విశాఖ గురించి నువ్వా మాట్లాడేది?

- అతడికి ఏ పార్టీ టికెట్ ఇవ్వకూడదు
- నవనిర్మాణ సమితి అధ్యక్షుడు తోట రాజీవ్

సీతంపేట : ఇన్నాళ్లు ఉత్తర నియోజకవర్గం ప్రజలకు కనిపించని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు విశాఖ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదని విశాఖపట్నం నవనిర్మాణ సమితి అధ్యక్షుడు తోట రాజీవ్ దుయ్యబట్టారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పుడు పడుకొని లేచి అందరినీ విమర్శిస్తున్న గంటాకు అసలు మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుందన్నారు. ఒక్కసారి కూడా నియోజకవర్గ ముఖం చూడని ఇటువంటి అవినీతి పరుడికి ఏ పార్టీ టికెట్ ఇవ్వకూడదన్నారు. నిజాయితీగా పనిచేస్తే ప్రతిసారి వేరే నియోజకవర్గానికి ఎందుకు వెళ్లిపోతున్నావని ప్రశ్నించారు. ప్రజల నుంచి, క్యాడర్ నుంచి వ్యతిరేకత ఉంది కాబట్టి అదే స్థానంలో మరోసారి పోటీ చేయడం లేదన్నారు. ఇప్పుడు భీమిలి సీటు కోసం ఎందుకు ఆరాటపడుతున్నాడంటే అక్కడ ఉన్న ల్యాండ్ మాఫియా ఎన్నికల్లో పెట్టుబడి పెడుతుందని ఆరోపించారు. ఫలితంగా తర్వాత దోచుకోవచ్చన్న ఎత్తుని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతలు నెరవేర్చని గంటా వంటి నాయకులకు ఏ పార్టీ టికెట్ ఇవ్వరాదని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న నవనిర్మాణ సమితి అధ్యక్షుడు తోట రాజీవ్

విశాఖ అభివృద్ధిని మేనిఫెస్టోలో చేర్చాలి

విశాఖ అభివృద్ధి అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టిన రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తోట రాజీవ్ అన్నారు. విశాఖను తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూర్చుకోగలిగే నగరంగా తీర్చిదిద్దవచ్చన్నారు. విశాఖతో పాటు మన్యం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో కలిపి విశాఖ నగరాన్ని మంచి టూరిజం హబ్‌గా రూపొందించవచ్చన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయపార్టీలు విశాఖ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. లంకా మోహనరావు మాట్లాడుతూ సంపదంతా ప్రజలకు పంచి వస్తే గంటాను పార్టీలోకి తీసుకుంటామని పవన్ కల్యాణ్ గతంలో చెప్పారని.. ఇప్పుడు ఆయన పార్టీ కార్యకర్తలు గంటా కోసం ఎలా పనిచేస్తారో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నవ నిర్మాణ సమితి ప్రతినిధులు పుల్లయ్య నాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.